సాయిగీతాశ్రమంలో చండీ హోమం

● పాల్గొన్న మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, మాజీ ఎమ్మెల్యే

కండ్లకోయలోని సాయిగీతాశ్రమంలో నిర్వహించిన చండీహోమంలో పాల్గొన్న మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎర్రొల్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్



సాయిబాబాకు హారతి ఇస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

మేడ్చల్ రూరల్, డిసెంబర్ 26: ప్రజా క్షేమం కోసం యజ్ఞాలు చేయడం శుభ పరిణామమని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మేడ్చల్ మండలం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ శివారులోని సాయిగీతాశ్రమంలో ఈ నెల 31న నిర్వహించే సర్వ దోష నివారణ మహాయజ్ఞంలో భాగంగా మంగళవారం శ్రీ చండీ హోమం నిర్వహించారు. హోమంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్లు వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎర్రొల్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్, నాయకుడు గాలి అనిల్ కుమార్‌తో కలిసి మాజీ మంత్రి హోమంలో పాల్గొన్నారు. అనంతరం సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ నిస్వార్థంతో చేపట్టే యజ్ఞంతో లోక కళ్యాణం జరుగుతుందని, ప్రజలు పాల్గొనాలని కోరారు. హోమంలో ఆశ్రమ మేనేజర్ శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

జవహర్‌నగర్, డిసెంబర్ 26: జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. కార్పొరేషన్ పరిధిలోని వైఎస్ఆర్ నగర్‌లో శ్రీనివాసులు, భార్య భాగ్య, కూతురు ఝాన్సీతో కలిసి నివాసముంటున్నాడు. కూతురు ఝాన్సీ(21) ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు పూర్తిచేసి ఇంట్లోనే ఉంటున్నది. మంగళవారం తల్లిదండ్రులు పనికి వెళ్లగా ఝాన్సీ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దాంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు ఝాన్సీ కోసం వెతికినప్పటికీ ఆచూకీ దొరకలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు జవహర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురు అరెస్టు

జవహర్‌నగర్, డిసెంబర్ 26: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధి అరుంధతినగర్‌లో గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. కొమ్ము విజయ్(27), గిడ్డ పవన్‌కుమార్(42), కుంచం ప్రశాంత్(23), కె. అరుణ్‌కుమార్(30)లను పట్టుకుని వారి వద్ద 250గ్రాముల గంజాయి, రెండు చిన్న సీసాలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సీతారాం తెలిపారు. కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు జరుపుతున్నట్లు చెప్పారు.

27 నుంచి 30 వరకు లోక్ అదాలత్

మేడ్చల్, డిసెంబరు 26 : మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులపై ఈ నెల 27 నుంచి 30 వరకు లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు ట్రాఫిక్ సీఐ హనుమాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రంకన్ డ్రైవ్, లైసెన్స్ లేకుండా వాహనాల నడిపిన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9440521015, 8328079 774 నంబర్లలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ముగ్గురు మృతి

శామీర్‌పేట, డిసెంబర్ 26: వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో గాయపడి దవాఖానల్లో చికిత్స పొందుతున్న ఇద్దరు మంగళవారం మృతిచెందారు. శామీర్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట కట్టమైసమ్మ ఆలయ సమీపంలో సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి శామీర్‌పేట ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడినుంచి గాంధీ దవాఖానకు తరలించారు. కాగా మంగళవారం ఉదయం చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. మృతుడి సమాచారం తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని కోరారు

మరో ప్రమాదంలో..

జవహర్‌నగర్‌కు చెందిన కృష్ణచారి ఈ నెల 23న స్కూటీపై లాల్‌గడి మలక్‌పేట గ్రామానికి వచ్చి వెళ్తున్నాడు. మార్గమధ్యలో అలియాబాద్ హాస్టల్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కృష్ణచారిని చికిత్స నిమిత్తం తిరుమలగిరిలోని ప్రైవేటు ఆస్పత్రి, అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోతాయిపల్లిలో..

మండలంలోని పోతాయిపల్లికి చెందిన దెయ్యాల అశోక్ రోజు మాదిరిగానే ఈ నెల 24న రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చాడు.మత్తులో ఇంట్లోని దోమల మందు(పురుగుల మందు) తాగాడు. మంగళవారం ఉదయం తనకి ఒంట్లో బాగోలేదని భార్య శారదకి చెప్పాడు. చికిత్స నిమిత్తం అశోక్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

శామీర్‌పేటలో దారి దోపిడీ

● కూరగాయలు అమ్మే వ్యక్తి వద్ద రూ. 17 వేలు అపహరణ

శామీర్‌పేట, డిసెంబర్ 26 : కొందరు దుండగులు దారి దోపిడీకి పాల్పడి కూరగాయాలు అమ్ముకునే వ్యక్తి వద్ద రూ.17 వేలు అపహరించుకుపోయారు. సోమవారం అర్ధరాత్రి ఈ సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... సిద్ధిపేట జిల్లా రామారానికి చెందిన బక్కోళ్ల దుర్గయ్య తన అశోక్ లేల్యాండ్ వాహనంలో బోయిన్‌పల్లి మార్కెట్‌లో టమాటా లోడు దించి సోమవారం అర్ధరాత్రి ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యలో శామీర్‌పేట లోని ఫౌజీ దాబా వద్ద రెండు బైక్‌పై వచ్చిన నలుగురు వ్యక్తులు దుర్గయ్య వాహనాన్ని ఆపి తాళంచెవి తీసుకున్నారు. అదేవాహనంలో ఉన్న అతడి తమ్ముడిని కత్తితో బెదిరించి దుర్గయ్యని కొట్టారు. అంతేకాకుండా అతడి వద్ద ఉన్న రూ. 17 వేల నగదును తీసుకుని పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

పీర్జాదిగూడలో ఎగ్జిబిషన్

● జనవరి 6 వరకు కొనసాగనున్న ప్రదర్శన

● వేలాదిగా తరలివస్తున్న ప్రజలు

పీర్జాదిగూడ, డిసెంబర్ 26: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ఉప్పల్ ఆర్టీసీ డిపో సమీపంలోని మైదానంలో ఏర్పాటు చేసిన జీవన్‌సాగర్ ఎగ్జిబిషన్ పరిసర ప్రాంతాల ప్రజలను ఆకట్టుకుంటున్నది. ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల షాపులు ఏర్పాటు చేయడంతో ప్రజలు సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారు. జ్యువెలరీ స్టాల్స్, డ్రెస్స్ మెటీరియల్, వివిధ రకాల ఆట వస్తువుల దుకాణాలను ఏర్పాటు చేసి అందుబాటు ధరలకే విక్రయిస్తున్న నిర్వాహకుడు నారాయణ తెలిపారు. ప్రధానంగా ఎగ్జిబిషన్‌లో అండర్ వాటర్ ఫిష్ ఎక్వేరియం,జెయింట్ వీల్, బ్రేక్‌డ్యాన్స్, సొలాంబో, డ్రాగన్ ట్రైన్, బోట్ రైడ్, బౌన్సర్, కొలంబస్, మెరిగో రౌండ్ లాంటివి ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఆల్ వెరైటీ ఫుడ్స్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌కు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తున్నట్లు తెలిపారు. జనవరి 6 వరకు సాయంత్రం 3 నుంచి రాత్రి 10 గంటల వరకు ఎగ్జిబిషన్ కొసాగుతుందని నిర్వాహకులు చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పీర్జాదిగూడలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

అతిపెద్ద జెయింట్‌వీల్

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 26 : ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం వార్డు అధికారులతో మున్సిపల్ చైర్మన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు అన్ని వార్డుల్లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయ జయంతి

దత్తాత్రేయ జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

శామీర్‌పేట, డిసెంబర్ 26 : మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రి గ్రామంలో మంగళవారం దత్తాత్రేయ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. షిరిడీసాయి ద్వారకామయి ధ్యాన మందిరంలో ఆలయ వ్యవస్థాపకుడు సద్గురు శ్రీసాయిరాజ్ బాబా ఆధ్వర్యంలో దత్తాత్రేయ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు బాబా సందేశం ఇచ్చారు. శ్యామ్‌రావు భజన మండలి ఆధ్వర్యంలో సాయిబాబా, దత్రాత్రేయ స్వామి గీతాలు ఆలపించారు. అనంతరం అన్నదానం చేశారు.

అన్నోజిగూడలో అయ్యప్ప మహాపడిపూజ

ఘట్‌కేసర్, డిసెంబర్ 26 : పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో మంగళవారం అయ్యప్పస్వామి మహాపడిపూజ భక్తిశ్రద్ధలతో జరిగింది. స్థానిక అయ్యప్ప దేవాలయం వద్ద పోచారం మున్సిపాలిటీ 10 వార్డు కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్ ఆధ్వర్యంలో మహాపడిపూజ నిర్వహించారు. భక్తులు, మాలధారులు అయ్యప్ప స్వామి గీతాలు ఆలపించారు. అనంతరం అన్నదానం చేశారు. పీసీసీ వైస్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్‌రెడ్డి, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్ సాయిరెడ్డి, కేరళతాంత్రిక్ రాజేశ్ నంబూద్రి, గురుస్వామి దర్శన్, అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు యూటర్న్ మూసివేత

శామీర్‌పేట, డిసెంబర్ 26 : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్క రూ సహకరించాలని మేడ్చల్ ట్రాఫిక్ సీఐ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శామీర్‌పేట మండల కార్యాలయాల వద్ద రాజీవ్ రహదారిపై ఇంతకుముందున్న యూటర్న్ వద్ద సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేసి మూసివేసి రాకపోకలను నిలిపివేశారు. రోడ్డు దాటాలనుకునే వాహనదారులు బ్రిడ్జి కింది నుంచి లేదా అలియాబాద్ చౌరస్తా, శామీర్‌పేట ప్రధాన రోడ్డు వద్ద యూటర్న్ తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఆయన వెంట సిబ్బంది సచ్చిదానందం, జీవన్‌కుమార్, షానుర్ ఉన్నారు.